క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



యువతకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ ప్రదీప్

సింగరాయకొండ: సైబర్ నేరగాళ్ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ సెక్యూరిటీ కౌన్సిలర్ కొత్తపల్లి ప్రదీప్ సూచించారు. మండల కేంద్రంలోని ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, మలినేని పెరుమాళ్లు మహిళా ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు గురువారం సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఏ విధంగా యువతను వలలో వేసుకుంటారో కళ్లకుకట్టినట్లు వివరించారు. అత్యాశకు పోవద్దని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సౌజన్య, ఎస్సై బి.మహేంద్ర, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వారం ప్రారంభం

మద్దిపాడు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలో గురువారం నిరసన వారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తమ డిమాండ్ల సాధన కోసం కూటమి ప్రభుత్వానికి నిరసన తెలుపుతున్నట్లు వారు తెలిపారు. 12వ తేదీ మండల కేంద్రాలలో నిరసన ప్రదర్శన చేయనున్నట్లు చెప్పారు. 13, 14 తేదీలలో ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలివ్వడం, 15వ తేదీ తాలూకా కేంద్రాలలో నిరసన ప్రదర్శన, 16వ తేదీ జిల్లా కేంద్రంలో నిరసన, 17న సీఎం, సీఎస్‌లకు ఈ మెయిల్స్, వాట్సాప్‌ల ద్వారా డిమాండ్లు పంపడం వంటి కార్యక్రమాలు చేయనున్నట్లు ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు డి.రామిరెడ్డి, ఈమని శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.శేఖరరెడ్డి తెలిపారు.

15 నుంచి గాలికుంటు వ్యాధికి టీకాలు

మద్దిపాడు: మండలంలోని పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి.కిషోర్‌కుమార్ తెలిపారు. గాలికుంటు వ్యాధి వలన పశువు ఉత్పాదక శక్తి తగ్గిపోతుందని, దూడలు, పడ్డలు చనిపోయే ప్రమాదం కూడా ఉందని తెలిపారు. పశుపోషకులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశువులకు వేయించాలని కోరారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకూ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను మండలంలో వేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. పశుపోషకులు తమ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

రేపు ఉచిత పశు వైద్య శిబిరం

కొత్తపట్నం: ఆచార్య ఎన్‌జీ రంగా సర్వీస్ ఫౌండేషన్, ఒంగోలు వారు, జిల్లా పశుసంవర్ధకశాఖ నిర్వహణలో ఈ నెల 13వ తేదీ ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ సభ్యుడు మండవ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. పశుపోషకులు వారి పశువులతో వచ్చి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఒంగోలు ఏఎంసీ చైర్మన్‌గా రాచగర్ల



ఒంగోలు సబర్బన్: ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రాచగర్ల వెంకట్రావు (శివపురం)ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ ప్రెసిడెంట్‌గా చిట్టెం వెంకట దుర్గాప్రసాద్, సభ్యులుగా ఉల్చి నందగోపాల్‌రెడ్డి, సింగోతు కృష్ణ కుమారి, ఎస్‌కే అమురుల్లా, సూదనగుంట శ్రీనివాసులు, గంగవరపు సందీప్, రాపూరి నాగమణి, పప్పు శ్రీను, యాదల కోటేశ్వరమ్మ, ఆకుతోట వెంకటేశ్వర్లు, నూశం ఆదిలక్ష్మి, నత్తల అనిత, బొద్దులూరి శోభారాణి, ముత్యాల సుజాతను నియమించారు. చైర్మన్ రాచగర్ల వెంకట్రావు టంగుటూరు మండలం శివపురం గ్రామ సర్పంచ్‌గా నాలుగు దఫాలు పనిచేశారు.

మహిళ మెడలో చెయిన్ చోరీ

ఒంగోలు టౌన్: గుడికి వెళ్లి వస్తున్న ఒక మహిళ మెడలో బంగారు చెయిన్‌ను దుండగుడు లాక్కుని వెళ్లిన ఘటన గురువారం ఒంగోలు నగరంలో జరిగింది. స్థానిక తాలూకా పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు నిర్మల్‌నగర్‌కు చెందిన విజయ అనే మహిళ మంగమూరు రోడ్డులోని పంచముఖ ఆంజనేయ స్వామి గుడికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఒంటరిగా నడుచుకుని వస్తున్న ఆమెను మోటారు బైకుపై అనుసరించిన ఇద్దరు వ్యక్తులు మెడలోని చెయిన్ లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇదేంది రాజా ఇదీ..?

- ఒంగోలు రాజాపానగల్ రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిపివేసిన టీడీపీ నాయకుడు రాజేష్
- అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సైతం పట్టించుకోని వైనం
- బారికేడ్లు ఏర్పాటు చేసి వెళ్లిపోయిన పోలీసులు
- నాలుగు గంటల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నగర ప్రజలు



రాజాపానగల్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేసి టీడీపీ నాయకులు రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఒంగోలు సబర్బన్:

అధికారం ఉంటే ఏమైనా చేయొచ్చన్నట్లుగా టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒంగోలు నగర ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడతారని తెలిసినా ప్రధాన రోడ్డుపై గురువారం నాలుగు గంటల పాటు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. పోలీసులు బారికేడ్లు అప్పగించి వెళ్లిపోవడంతో టీడీపీ వారే వాటిని రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపించాయి. రోడ్డును బ్లాక్ చేసి అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూడా ప్రజల ఇబ్బందుల గురించి పట్టించుకోకపోవడం చర్చనీయాంశమైంది. పూర్తి వివరాల్లోకెళ్తే.. ఒంగోలు నగరంలోని ప్రధాన రోడ్లలో ఒకటైన రాజాపానగల్ రోడ్డులో టీడీపీ 26వ డివిజన్ అధ్యక్షుడు తూము రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం గురువారం మధ్యాహ్నం 4 గంటల పాటు ఈ రోడ్డును దిగ్బంధం చేయడంతో నగర ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో పాటు కూటమి పార్టీల నాయకులు హాజరవగా, పోలీసులు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి వెళ్లిపోయారు. దాంతో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆ రోడ్డులో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కనీసం సైకిల్ కూడా వెళ్లే వీలులేకుండా నిలువరించడంతో ఆ రోడ్డులో నుంచి వెళ్లాల్సిన వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. కొణిజేడు బస్టాండ్, వీవీపీ రోడ్డు, గద్దలగుంట రోడ్డు, మామిడిపాలెం, లాయర్‌పేట, మంగమూరు రోడ్డు, వెంగముక్కలపాలెం రోడ్డు జంక్షనకు వెళ్లేవారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రోడ్డులో రాకపోకలు నిలిపివేస్తే నగరవాసుల పరిస్థితి ఏంటని ఎమ్మెల్యేకి, పోలీసులకు తెలియదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారం ఉంటే ఇష్టంవచ్చినట్లు నాయకులు చేయొచ్చా అంటూ నిలదీస్తున్నారు. నగరంలో టీడీపీ కూటమి పార్టీల నాయకుల చేష్టలను ఛీ కొడుతున్నారు.

ఆదిమూలపు సురేష్‌ను కలిసిన కేవీ, వైవీ



ఒంగోలు సిటీ:

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కె.వి.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

చుండూరిని కలిసిన గౌతమ్ అశోక్



చుండూరి రవిబాబును సన్మానిస్తున్న గౌతమ్ అశోక్

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన వై.వి.గౌతమ్ అశోక్ గురువారం ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బాపట్ల హనుమంతరావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

జామతోటల్లో యాజమాన్య పద్ధతులపై శిక్షణ



జామ రైతులకు సూచనలు చేస్తున్న సైంటిస్ట్ రవీంద్రబాబు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్, హార్టీకల్చర్ అధికారిణి సంధ్య, తదితరులు

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో జామతోటలు వేసిన రైతులకు యాజమాన్య పద్ధతులపై జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్ పాల్గొని మాట్లాడుతూ జామ తోటల్లో ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. రైతులు జామ పండ్ల నాణ్యత పెంచుకోవడానికి ఫ్రూట్ కవర్స్ వినియోగించాలని, అందుకు తమ శాఖ ద్వారా హెక్టార్‌కు 25 వేల రూపాయల రాయితీ అందిస్తున్నామని తెలిపారు. అదే విధంగా కోత అనంతరం పండ్లను గ్రేడింగ్ చేసుకుని ప్యాకింగ్ చేసుకోవడానికి వీలుగా తోటలోనే ప్యాక్ హౌస్ నిర్మాణం చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్యాక్ హౌస్ నిర్మాణానికి తమ శాఖ ద్వారా రూ.2 లక్షల రాయితీ అందిస్తున్నామన్నారు. ఉద్యానవనశాఖ సైంటిస్ట్ రవీంద్రబాబు మాట్లాడుతూ రైతులు జామతోటలలో కచ్చితంగా కోత అనంతరం కత్తిరింపులు చేయాలన్నారు. దీని వలన కొత్త కొమ్మలపై చిగురులు వచ్చి అధికంగా పూత, పిందెలు ఏర్పడి దిగుబడి పెరుగుతుందన్నారు. జామతోటలలో పండు ఈగ ఉధృతి ఎక్కువగా ఉంటుందని, నివారణకు తోటలను శుభ్రంగా ఉంచుకుని పిందె దశ దాటిన తర్వాత రోజు నుంచి మిథైల్ యుజినాల్ ఎరలను ఎకరానికి 7 నుంచి 8 వరకూ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం జామతోటల్లో పర్యటించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఉద్యానవన శాఖ అధికారిణి సంధ్య, గ్రామ సహాయకుడు షరీఫ్, రైతులు పాల్గొన్నారు.


జ్వరపీడితులను సకాలంలో గుర్తించాలి



కమిషనర్ జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న జేడీ సునీల్ నాయక్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: జిల్లాలో జ్వరంతో బాధపడుతున్న వారిని సకాలంలో గుర్తించి సరైన వైద్య సహాయం అందించాలని వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. గురువారం జిల్లాలోని ప్రోగ్రామ్ అధికారులకు వైద్యారోగ్య శాఖ అధికారి చాంబర్లో జూమ్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ ప్రారంభిస్తున్న స్వస్తనారి శక్తి అభియాన్ కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమ కాటు వలన వచ్చే వ్యాధులను, నీటి కాలుష్యం వలన సంభవించే వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత సీజన్లో మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధులు సంక్రమించిన గ్రామాలలో, చుట్టుపక్కల గ్రామాలలో ఇంటింటి సర్వేలు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, మున్సిపల్, తదితర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సికిల్ అనిమియాతో బాధపడుతున్న వారిని గుర్తించి వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ నాయక్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు పాల్గొన్నారు.

సింగరాయకొండ ఎస్సైను తప్పించాలి



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు వన్‌టౌన్: పోక్సో కేసులో కీచకుడికి కొమ్ముకాస్తున్న సింగరాయకొండ ఎస్సైను తప్పించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఒంగోలు దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరాయకొండ మండలం పాకల ఊళ్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి బాలికను హజరత్తయ్య అనే పీఈటీ లైంగికంగా వేధించడంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన డిప్యూటీ ఈఓపై విద్యార్థినుల పేర్లు తెలపాలని ఎస్సై ఒత్తిడి తెచ్చారన్నారు. పోక్సో యాక్టు ప్రకారం బాధితుల పేర్లు తెలపకూడదన్నారు. కేసు నమోదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పాటకలపూడి జయరాం, దారా అంజయ్య, కాకుమాను రవి తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి మొక్కల పంపిణీ

దర్శి: పట్టణంలోని శివరాజ్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మానవతా సేవా సంస్థ కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గొర్రెపాటి వేణు 1000 మొక్కలు గురువారం పంపిణీ చేశారు. పాఠశాలలో మానవత సేవా సంస్థ ప్రతినిధులు మొక్కలు నాటారు. రాబోయే వర్షాకాలంలో శివరాజనగర్, శాంతి నగర్‌లో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి రఘురామయ్య మానవత సభ్యులను అభినందించారు.

రైతుల వెన్ను విరుస్తున్న కూటమి సర్కార్

కురిచేడు: కూటమి సర్కార్ రైతుల వెన్ను విరుస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కురిచేడు మండలం అలవలపాడు, పడమర వీరాయిపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంత మందికి అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ సుబ్బయ్య మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కి హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, నియోజకవర్గ ఇంటలెక్చువల్ వింగ్ అధ్యక్షుడు వీరగంథం కోటయ్య, నుసుం ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు పోకూరి సుబ్బారావు, తాళ్లూరి ఆంజనేయులు, ఊట్ల పోలయ్య, కొండమీద హనుమంతరావు, ఆళ్ల గోవిందు, మన్నెం అశోక్, చామర్తి చిరంజీవి, మానం బాలాగురవయ్య, ఊట్ల ఆంజనేయులు, వీరగంథం వెంకట్రావు, రావి వెంకట్రావు, గూడూరి సాల్మన్, జగసానిగుట్ల నాగేశ్వరరావు, గూడూరి శాంసన్, సోషల్ మీడియా కన్వీనర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మాదిగలకు శ్మశాన స్థలాన్ని కేటాయించాలి

కురిచేడు: మండలంలోని పెద్దవరం మాదిగ పల్లెలో 100 కుటుంబాలకు నేటికీ శ్మశాన వాటిక లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గతంలో ఎన్నోసార్లు రెవెన్యూ అధికారులకు శ్మశాన స్థలం మంజూరు చేయాలని కోరినట్లు గ్రామస్తులు తెలిపారు. పెద్దవరం గ్రామంలోని సర్వే నంబర్ 101/1, 95/6, 74లో శ్మశాన వాటికకు అనువైన గ్రామ కంఠం ఉందని, సర్వే నంబర్ 95/6లో విస్తీర్ణం 7.32 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిని శ్మశాన వాటికకు కేటాయిస్తే తమకు అనుకూలంగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు. గురువారం తహసీల్దార్ జి.రజనీకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. యర్రగుంట్ల ఇమ్మానుయేల్, మాగులూరి రామయ్య, సోమవరపు ఇశ్రాయేల్, మక్కెనకొండ గురవయ్య, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సభ అట్టర్ ఫ్లాప్

దర్శి: కూటమి ప్రభుత్వం అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్ సభ అట్టర్ ఫ్లాప్ అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని బండి వెలిగండ్ల, లంకోజనపల్లి, ఎర్రఓబనపల్లి గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలనుపూర్తి స్థాయిలో అమలు చేయకుండా సూపర్ సిక్స్..సూపర్ హిట్ అని చెప్పడం దారుణమని మండిపడ్డారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్లకార్డుల ద్వారా ప్రజలకు వివరించారు. రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు బుజ్జి, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు బాబూరావు, బీసీ సెల్ అధ్యక్షుడు అంకాల శ్రీను, ఆర్‌ఆర్‌ఆర్ రవి, సర్పంచ్‌లు కైపు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాలి

దర్శి: అంతరాయాలు లేని మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ ఎస్‌ఈ కె.వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. స్థానిక శ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపంలో దర్శి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాల నివారణలో భాగంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తీగల కింద ఉన్న చెట్లు తొలగించాలని ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండి వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కింద రూఫ్ టాఫ్ ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.